సాక్షి అనకాపల్లి

7

సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



అదిరే అదిరే..

పర్యాటకులను మూడు రోజులపాటు అలరించిన అరకు ఉత్సవ్ ఘనంగా ముగిసింది. సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సినీ గాయకులు వందేమాతరం శ్రీనివాస్, మంగ్లీ గీతాలాపన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన గిరిజన కళాకారుల ప్రదర్శనలు అలరించాయి.

8లో



ఫైనల్ మ్యాచ్‌లో వికెట్ తీసిన ఆనందంలో షబ్నమ్

- టీ-20 అండర్-19 మహిళల ప్రపంచ కప్ విజేత భారత్
- గెలుపులో పేస్ బౌలర్‌గా సత్తా చాటిన విశాఖ అమ్మాయి

భారత యువ క్రికెట్ జట్టు టీ-20 అండర్ - 19 మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. ఈ విజయంలో విశాఖకు చెందిన పేస్ బౌలర్ షబ్నమ్ కీలక పాత్ర పోషించింది. షబ్నమ్ తన అద్భుతమైన బౌలింగ్‌తో ప్రత్యర్థులను కట్టడి చేసింది. కీలకమైన ఫైనల్ మ్యాచ్‌లో ఆమె కచ్చితమైన లైన్, లెంగ్త్ బంతులు విసిరి బ్యాటర్లను ఇబ్బంది పెట్టింది. - విశాఖ స్పోర్ట్స్

ఎనిమిదేళ్ల ప్రాయంలో సరదాగా తండ్రితో రన్నింగ్ చేయడానికి వెళ్తూ అక్కడ క్రికెట్ ఆడుతున్న అమ్మాయిల్ని చూసింది షబ్నమ్. అలా క్రికెట్‌పై మక్కువ పెంచుకుంది. ఆమె తండ్రి షకీల్ క్రికెట్ ఆటగాడు కావడంతో.. షబ్నమ్ ఆసక్తిని గమనించి ఆటలో ప్రాథమిక మెళకువలు నేర్పించారు. అనంతరం జాతీయ క్రికెట్ అకాడమీలో మెళకువలు తోడవడంతో అంతర్జాతీయ స్థాయిలో చెలరేగే బంతులేసే స్థాయికి ఎదిగింది. కెరీర్ ప్రారంభించి పదేళ్లలోనే జాతీయ అండర్-19 జట్టులో స్థానం సంపాదించిన షబ్నమ్.. భారత్ పర్యటనలో భాగంగా న్యూజిలాండ్ మహిళా అండర్-19 జట్టు సిరీస్‌లో తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడింది. నేడు మహిళల టీ-20 అండర్ 19 వరల్డ్ కప్‌ను రెండోసారి భారత్ జట్టు అందుకోగా.. రెండుసార్లు విశాఖకు చెందిన షబ్నమ్ పేస్‌తో బెంబేలెత్తించిన పాత్ర గర్వించదగ్గది.

2019లో విశాఖకు ప్రాతినిధ్యం

శిక్షణ శిబిరంలో నేర్చుకున్న ఆటతో 2019లో అండర్-16లో విశాఖ జిల్లాకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి షబ్నమ్ చేరుకుంది. వేసవి శిబిరాల్లోనే జట్టుగా ఆడేటప్పుడే పేస్ బౌలింగ్ వైపు ఆసక్తి పెరిగి పేస్‌లో వేరియేషన్స్‌తో జట్టుకు కీలకంగా మారింది. కరోనా బ్రేక్ తర్వాత తిరిగి 2022లో పోటీలు ప్రారంభం కావడంతో దేశవాళీ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో ఆడింది. చాలెంజర్ ట్రోఫీతో పాటు స్కూల్ గేమ్స్ నేషనల్స్ అండర్ 17 జట్టుకు ఆడింది.

క్వాడ్రేంగులర్ సిరీస్‌లో భాగంగా శ్రీలంక, వెస్టిండీస్‌తో తలపడిన భారత్ బి జట్టు తరఫున రెండు మ్యాచ్‌లు ఆడింది. అనంతరం టీ-20 భారత్ మహిళా అండర్-19 జట్టు తరఫున ఆడే అవకాశం దక్కింది. 2023 అండర్ 19 మహిళల టీ-20 వరల్డ్‌కప్‌లో మూడు మ్యాచ్‌లకే పరిమితమైనా.. అప్పుడు లభించిన అనుభవాన్ని తాజా వరల్డ్‌కప్‌లో చూపించింది. కోలాలంపూర్‌లో జరిగిన వరల్డ్‌కప్‌లో అన్ని మ్యాచ్‌ల్లోనూ ఆడి నాలుగు కీలక వికెట్లు తీసింది. ఫైనల్‌లో దక్షిణాఫ్రికా ఓపెనర్‌ను నిలదొక్కుకోనివ్వకుండా పెవిలియన్‌కు పంపడంతో పాటు జట్టును తక్కువ స్కోర్‌కే పరిమితం చేయడంలో కీలకపాత్ర పోషించింది. 'అండర్-19 మహిళా జట్టుకు ఎంపిక కాగానే నేషనల్ క్రికెట్ అకాడమీలో పేస్‌కు మరింత వేగం పెంచుకునే విధంగా శిక్షణ పొందాను. ఐసీసీ ట్రోఫీని జట్టు అందుకోవడంలో తోటి క్రీడాకారిణుల సహకారంతో నా వంతు పాత్ర పోషించాను.' అని షబ్నమ్ తెలిపింది.

తీరంలో ఇసుక తోడేళ్లు

ఇసుక తోడేళ్లు సముద్ర తీర ప్రాంతంపై పడ్డాయి...నదీగర్భాలు తోడేసిన ఇసుకాసురులు ఇపుడు సముద్ర ఇసుకను యథేచ్ఛగా తరలించేస్తున్నారు. కాసులు పిండేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలకు సముద్ర ఇసుకను వాడేస్తున్నారు. తీరానికి కోత పెడుతున్నారు. తీరగ్రామాలకు ముప్పు తెచ్చి పెడుతున్నారు. రాంబిల్లిలో సముద్ర ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో రెవెన్యూ, మెరైన్, పోలీసు, అటవీ శాఖలు విఫలమయ్యాయి.


వాడపాలెం సముద్ర తీరంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రదేశం


కొత్తపట్నం తీరంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రదేశం

- అడ్డగోలుగా సముద్రపు ఇసుక తరలింపు
- రాంబిల్లిలో రెవెన్యూ, మెరైన్, పోలీసు, అటవీ శాఖల నిఘా వైఫల్యం
- భవన నిర్మాణాల్లో యథేచ్ఛగా వాడకం
- ఈ ఇసుక వాడితే అనతికాలంలోనే కూలిపోయే ప్రమాదం
- ఇసుక దిబ్బలు క్షీణిస్తే సముద్రపు పోటు ముప్పు

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి తీర ప్రాంతాల్లో ఇసుక మాఫియా విచ్చలవిడిగా తవ్వకాలు జరుపుతున్నారు. మండలంలో లోవపాలెం, సీతపాలెం, వాడపాలెం, కొత్తపట్నం సముద్ర తీర ప్రాంతాల్లో రాత్రి పగలు ఎక్స్‌కవేటర్‌తో తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక ఇవ్వడానికి డిపోలు పెట్టినా రాంబిల్లి మండలంలో సముద్రపు ఇసుకను దొడ్డిదారిన అమ్మి కొంత మంది ఇసుక మాఫియా రూ.లక్షల్లో సొమ్ము వెనకేసుకుంటున్నారు. ఇక్కడి సముద్రతీర ప్రాంతంలో లభించే ఇసుక నదుల్లో, ఏరుల్లో లభించే ఇసుక మాదిరిగా ఉండడంతో దీనిని ఆసరాగా తీసుకొని ఇసుక మాఫియా యథేచ్ఛగా భవన నిర్మాణాలకు ఇసుక సరఫరా చేసి రూ.లక్షల్లో డబ్బు ఆర్జిస్తున్నారు. ఇక్కడ ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్టు రెవెన్యూ, మెరైన్ పోలీసులకు, పోలీసులకు, అటవీశాఖ అధికారులకు తెలిసినా కూటమి నేతల ఒత్తిడికి తలొగ్గి చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. సముద్ర తీరం వెంబడి ట్రాక్టర్లకు బాటలు ఏర్పాటు చేసుకొని రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక తవ్వి తరలించేస్తున్నారు. నది ఇసుక, సముద్రపు ఇసుకను కలిపి భవన నిర్మాణ దారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సముద్రపు ఇసుకతో భవనాలు నిర్మిస్తే అనతికాలంలోనే కూలిపోయే ప్రమాదం ఉంది. అయినా కొందరు కాంట్రాక్టర్లు ప్రభుత్వ భవనాలు, కల్వర్టులు, వంతెనలు, రోడ్ల నిర్మాణంలో ఈ ఇసుకను విరివిగా వాడేస్తున్నారు.

తీరానికి గుండెకోత

అనకాపల్లి జిల్లాలో 72 కిలోమీటర్ల మేర సముద్రతీర ప్రాంతం విస్తరించి ఉంది, రాంబిల్లి మండలంలో సీతపాలెం, లోవపాలెం, వెంకయ్యపాలెం, వాడపాలెం, గోవిందపాలెం, వాడనర్సాపురం, కొత్తపట్నం తీర ప్రాంతాల్లో అటవీశాఖ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో జోరుగా ఇసుక తవ్వకాలు చేపట్టడం వల్ల సముద్ర తీరం కోతకు గురవుతుంది. ప్రకృతి విపత్తులు తుఫాన్‌లు వచ్చినప్పుడు ముంపు తప్పదు. అటవీ శాఖ వేసిన విలువైన సరగుడు కలప కూడా అక్రమార్కుల పాలవుతుంది. విలువైన చెట్లు తరలిపోవడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడిపోతున్నా అధికారులు కానీ ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదు. ఇసుక తవ్వకాలు అరికట్టాలని తీర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ముంపు ముప్పు

రాంబిల్లి మండలంలో నేవీ రక్షణ నిర్మాణ ప్రాజెక్టు డ్రెడ్జింగ్ పనుల వల్ల ఇప్పటికే మండలంలోని సముద్ర తీరం సమతుల్యత కోల్పోయింది. ఇసుక తవ్వేయడం వల్ల సముద్రం మరింత ముందుకు వచ్చే ప్రమాదం ఉంది. సముద్రపు అలలను ఆపేది ఇసుక దిబ్బలే. ఇసుక దిబ్బలు తరిగిపోవడం వల్ల సముద్రపు పోటు పెరుగుతుంది. ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంది. అధికారులు ఇసుక మాఫియాను అరికట్టాలి.



-చింతకాయల శివాజీ, జిల్లా డీవైఎఫ్ఐ అధ్యక్షుడు, మత్స్యకార సంఘం జిల్లా నాయకులు

అధికారుల నిర్లక్ష్యం వల్లే...



రాంబిల్లి మండలంలో సముద్రతీర ప్రాంతాల్లో సీతపాలెం, లోవపాలెం , వాడపాలెం, కొత్తపట్నం వరకు ఎక్కువగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. దీనివల్ల సముద్రం కోతకు గురవుతుంది. ప్రకృతి విపత్తులు, తుపానులు వచ్చినప్పుడు మత్స్యకార గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. రెవెన్యూ, పోలీస్ అధికారులు ఇసుక వాహనాలను పట్టుకోవడం మళ్లీ వదిలివేయడం జరుగుతుంది. అధికారుల నిర్లక్ష్యంతోనే తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయి.సముద్రపు ఇసుకతో భవనాలు నిర్మించడం వల్ల అవి తక్కువ కాలంలోనే కూలిపోయే ప్రమాదం ఉంది. రాంబిల్లి మండలంలో ఎక్కువగా సముద్రపు ఇసుక సరఫరా అవుతుంది. జనం మోసపోతున్నారు.

-జి.దేముడునాయుడు, రాంబిల్లి, సీపీఐ మండల కార్యదర్శి

చర్యలు తీసుకుంటాం

రాంబిల్లి మండలంలో సముద్ర తీర ప్రాంతాల్లో తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం వచ్చింది. రెవెన్యూశాఖ అధికారులు వెళ్లే సమయానికి తవ్వకం దారులు వెళ్లిపోతున్నారు. రాత్రులు ఇసుక తరలిస్తున్నట్టు గుర్తించి ఎవరైనా సమాచారం ఇస్తే వెంటనే సిబ్బందితో వెళ్లి చర్యలు తీసు కుంటాం. సముద్రతీర ప్రాంతాల్లో తవ్వకందారులు రెవెన్యూ అధికారులపై దాడులకు తెగబడుతున్నారని మా దృష్టికి వచ్చింది. సముద్రపు ఇసుక తరలించడం చట్టరీత్యా నేరం. సముద్ర ఇసుకను భవనాలలో ఎవరూ వినియోగించరాదు. ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం



-శ్రీనివాసరావు, రాంబిల్లి తహసీల్దార్

చిటికెలో స్కానింగ్

- ఎయిర్‌పోర్టులో బాడీ స్కానింగ్ మెషీన్లు
- శరీరంలో దాగి ఉన్న వస్తువుల్ని సైతం పసిగట్టే వ్యవస్థ
- సంపూర్ణ భద్రతతో పాటు చెకింగ్ వ్యవస్థ పటిష్టం
- ప్రయాణికుడి తనిఖీ సమయం ఆదా

సాక్షి, విశాఖపట్నం : విశాఖ విమానాశ్రయం నుంచి ఎయిర్ కనెక్టివిటీ విస్తరిస్తోంది. డొమెస్టిక్, ఇంటర్నేషనల్ ఆక్యుపెన్సీ 90 శాతం నమోదవుతోంది. భవిష్యత్‌లో ప్రయాణికుల రాకపోకలు, విమాన సర్వీసులు పెరిగే అవకాశం ఉంది. దీంతో భద్రత ప్రమాణాలు, చెకింగ్ తదితర అంశాలపైనా ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే డిజీ యాత్ర సర్వీసు ద్వారా ప్రయాణికుల వివరాల పరిశీలనను వేగవంతం చేసిన ఎయిర్‌పోర్టు.. తనిఖీల సమయాన్ని కూడా తగ్గించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. మేజర్ ఎయిర్‌పోర్టుల్లో ఉన్న ఫుల్ బాడీ స్కానింగ్ యంత్రాలను ఇక్కడ కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

త్వరలో ఏర్పాటు

ఇప్పటికే ఢిల్లీ, బెంగళూరు, ముంబై, కోల్‌కతా మొదలైన ఎయిర్‌పోర్టుల్లో ఉన్న అధునాతన ఇమేజింగ్ వ్యవస్థలైన ఫుల్ బాడీ స్కానర్లను విశాఖపట్నం ఎయిర్‌పోర్టులోనూ ఏర్పాటు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ స్కానర్ ప్రయాణికుడు మొత్తం శరీరాన్ని సెకన్ల వ్యవధిలో స్కాన్ చేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రయాణికుల సమయాన్ని ఆదా చేయడంతో పాటు.. వారిని ఇబ్బంది పెట్టకుండా స్కానింగ్ చేసేందుకు ఈ అత్యాధునిక మెషీన్ ఉపయుక్తమవుతుంది.


డిజీ యాత్ర ద్వారా మొబైల్ చెకింగ్

ఎలా పనిచేస్తుందంటే...

- కొందరు ప్రయాణికులు డ్రగ్స్, నిషేధిత వస్తువులను శరీర భాగాల్లో ఉంచి తరలిస్తున్న కేసులు ఇటీవల వివిధ ఎయిర్‌పోర్టుల్లో బయటపడ్డాయి. ఫుల్ బాడీ స్కానర్లు శరీరంలో నిషేధిత వస్తువులు ఎక్కడ ఉన్నా సులువుగా గుర్తించగలవు.
- విమానాశ్రయాలలో విస్తృతంగా ఉపయోగించే మెటల్ డిటెక్టర్లకు భిన్నంగా, ఈ స్కానర్లు పేలుడు పదార్థాలు వంటి లోహేతర వస్తువులను కూడా పసిగట్టేస్తాయి.
- ప్రయాణికుల స్క్రీనింగ్ సమయం 50 శాతం తగ్గుతుంది. ప్రస్తుతం భద్రతా సిబ్బంది ఒక ప్రయాణికుడిని తనిఖీ చేయడానికి దాదాపు 30 నుంచి 45 సెకన్లు పడుతుంది. కానీ.. ఈ అత్యాధునిక స్కానింగ్ మెషీన్‌తో స్క్రీనింగ్ సమయం దాదాపు 15 సెకన్లు మాత్రమే ఉంటుంది.


అత్యాధునిక బాడీ స్కానింగ్ యంత్రాలు

విశాఖ ఎయిర్‌పోర్టులో..

- ప్రతి నెలా సగటు స్వదేశీ ప్రయాణికులు- 2.50 లక్షలు
- ప్రతి నెలా దేశంలోని వివిధ ప్రాంతాలకు విమాన సర్వీసులు- 1,850
- ప్రతి నెలా సగటు అంతర్జాతీయ ప్రయాణికులు- 12,000
- ప్రతి నెలా దేశంలోని వివిధ ప్రాంతాలకు విమాన సర్వీసులు- 82
- ప్రయాణికుడి తనిఖీకి పట్టే సమయం- 30 నుంచి 45 సెకన్లు
- బాడీ స్కానర్ ద్వారా తనిఖీకి పట్టే సమయం- 15 సెకన్లు

- బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ మార్గదర్శకాల ప్రకారం.. వార్షికంగా 10 మిలియన్ల మంది ప్రయాణికులు ప్రయాణించే అన్ని ప్రధాన విమానాశ్రయాలలో పూర్తి బాడీ స్కానర్‌లను ఏర్పాటు చేయాలని భావించారు. కానీ.. త్వరలోనే దాదాపు అన్ని అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుల్లోనూ ఈ బాడీ స్కానర్లు రాబోతున్నాయని విమానాశ్రయ వర్గాలు చెబుతున్నాయి.
- దేశంలోని 130కి పైగా విమానాశ్రయాలను నిర్వహిస్తున్న ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ).. 198 బాడీ స్కానర్‌లని కొనుగోలు చేయాలని భావిస్తోంది.

కొత్త డీజీపీకి ఎస్పీ తుహిన్ సిన్హా శుభాకాంక్షలు


డీజీపీ హరీష్‌కుమార్‌కు ఎస్పీ అభినందనలు

అనకాపల్లి: రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ గుప్తాను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదివారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నామని ఆయన డీజీపీకి వివరించారు.

పోలీస్ గ్రీవెన్స్ తాత్కాలికంగా రద్దు

ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ తుహిన్ సిన్హా ఒక ప్రకటలో తెలిపారు.

నేటి నుంచి టీచర్ ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ

- విశాఖ కలెక్టరేట్‌లో ఏర్పాట్లు
- 11న నామినేషన్ల పరిశీలన

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం సోమవారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. కలెక్టర్ కార్యాలయంలోనే ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ప్రభుత్వ పని వేళల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య నామినేషన్లు దాఖలు చేయొచ్చు. 11న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 13న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మార్చి 3న కౌంటింగ్ జరగనుంది. ఎన్నికల్లో పోటీ చేసే జనరల్ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలి. ఉచితంగా ఇచ్చే దరఖాస్తులను ఇప్పటి వరకు 8 మంది తీసుకున్నారు. 4న మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, 6న పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి, 7న పాకలపాటి రఘువర్మ నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

123 పోలింగ్ కేంద్రాలు : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా మేరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో మొత్తం 21,555 మంది ఉన్నారు. గత ఏడాది డిసెంబర్ 30న ఓటర్ల తుది జాబితా ప్రకటించారు. చివరి తేదీ అయిన జనవరి 31 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 1,300 దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిశీలన జరుగుతోంది. ఆరు జిల్లాల పరిధిలో పురుష ఓటర్లు 12,948, మహిళా ఓటర్లు 8,607 మంది ఉన్నారు. ఉత్తరాంధ్ర పరిధిలో 123 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. విశాఖలో 13, అనకాపల్లిలో 24, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విజయనగరంలో 29, పార్వతీపురం మన్యంలో 15, శ్రీకాకుళంలో 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు 23 బృందాలను నియమించారు. వివిధ స్థాయి అధికారులతో కూడిన 12 మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు(ఎంసీసీ) బృందాలు, 11 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. వీరు కాకుండా జీవీఎంసీ అదనపు కమిషనర్, జెడ్పీ సీఈవో, భీమిలి, విశాఖ ఆర్డీవోలను నోడల్ అధికారులుగా నియమించారు.

క్లుప్తంగా

కోడి పందేలు ఆడుతున్న ఐదుగురి అరెస్ట్

మాకవరపాలెం: రెండు గ్రామాల్లో నిర్వహించిన కోడి పందేల్లో ఐదుగురిని అరెస్ట్ చేశామని ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. మండలంలోని శెట్టిపాలెం, కొండలఅగ్రహారం గ్రామ శివారుల్లో ఆదివారం కోడి పందేలు నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి నాలుగు కోళ్లు, రూ.22,500 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డెలివరీ బాయ్ దుర్మరణం



సంఘటన స్థలంలో నూతన్‌కుమార్ మృతదేహం

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ గొంతినవానిపాలెం శ్రీసింహాద్రి హోటల్ ఎదురుగా ఆదివారం ఉదయం హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొని డెలివరీ బాయ్ దుర్మరణం చెందాడు. అనకాపల్లి పట్టణం గాంధీనగర్‌కు చెందిన బయ్యవరపు నూతన్‌కుమార్(23) పీఎంపాలెంలో నివాసం ఉంటున్నారు. క్రికెట్ స్టేడియం వద్ద ఇన్‌స్టామార్ట్‌లో స్విగ్గీ డెలివరీ బాయ్‌గా విధులు పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై అనకాపల్లి నుంచి ఆనందపురం వైపు వస్తుండగా ఈ ప్రమాదానికి గురయ్యాడు. పొగమంచు కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని తల్లి నూకేశ్వరి ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు బాలబాలికల అదృశ్యం

వెతికిపట్టుకున్న పోలీసులు

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధి వేపగుంట ప్రాంతంలోని ఇద్దరు బాలికలు, ఒక బాలుడు అదృశ్యం కలకలం రేపింది. అయితే పోలీసులు సకాలంలో స్పందించి వారికి వెతికి పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతం అయింది. వివరాలివి..వేపగుంట సమీపంలోని ముత్యమాంబ కాలనీకి చెందిన ఆదిత్య సాహు(9), లక్ష్మి సాహు(8), గొర్లి గంగోత్రి(9) గత నెల 31 ఉదయం ఆడుకోవడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లారు. తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు కాలనీలో, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో శనివారం రాత్రి ఆదిత్య సాహు తల్లి పూజ పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే సీఐ కె.వి.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన ఐదు బృందాలు తీవ్రంగా గాలించాయి. ఆదివారం ఉదయం వారిని మన్యం జిల్లా మొక్కు మండలం సంబరం గ్రామంలో గుర్తించారు. వెంటనే అక్కడి నుంచి తీసుకువచ్చిన ఎస్ఐ అసిరి తాత బృందం.. వారికి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక తాత్కాలిక రద్దు

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దు చేసినట్లు అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం ఉండదన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మార్చి 8వ తేదీ వరకు ఈ కార్యక్రమం రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

అదిరే అదిరే..



ఈజిప్షియన్ నృత్యం



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



అరకు చలి ఉత్సవాలకు భారీగా తరలివచ్చిన జనం, ముందు వరుసలో కూర్చున్న జిల్లా అధికారులు



ప్రముఖ సినీ గాయకురాలు మంగ్లీతో కలిసి పాడుతున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



అద్భుత విన్యాసం

- ఘనంగా ముగిసిన అరకు ఉత్సవ్
- అన్నివర్గాల నుంచి విశేష ఆదరణ
- ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక ప్రదర్శనలు
- ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన గిరిజన కళాకారులు
- విజయవంతానికి కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రణాళికపరంగా చర్యలు

అరకులోయ టౌన్/డుంబ్రిగుడ: ఆంధ్రా ఊటీ అరకులోయలో నిర్వహించిన అరకు చలి ఉత్సవ్‌కు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. గత నెల 31న ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు నిర్వహించిన వివిధ రాష్ట్రాలకు చెందిన గిరిజన కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ సినీ గాయకులు వందేమాతరం శ్రీనివాస్, మంగ్లీ గీతాలాపన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఉత్సవాల చివరిరోజు ఆదివారం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలకు అన్నివర్గాల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. జిల్లా ఉన్నతాధికారులు కూడా ఉత్సవాల్లో మమేకమయ్యారు. కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఉత్సవాల విజయవంతానికి ప్రణాళికపరంగా చర్యలు చేపట్టారు.

ఉత్సాహంగా ట్రెక్కింగ్

అరకు చలి ఉత్సవ్‌లో భాగంగా ఆదివారం ఉదయం సుంకరమెట్టలో నిర్వహించిన ట్రెక్కింగ్ 3కే ఉత్సాహంగా సాగింది. దీనిని విశాఖపట్నం జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్ ప్రారంభించారు. సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, సబ్ డీఎఫ్‌వో ఉమామహేశ్వరి, స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం క్యూరేటర్ పి.శంకరరావు పాల్గొన్నారు. యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధం అమలు అవుతున్న నేపథ్యంలో వారు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. పర్యాటకుల్లో చైతన్యం తెచ్చేలా ట్రెక్కింగ్ సాగింది. ప్రకృతి ఒడిలో పక్షుల కిలకిలారావాలు, కాఫీ, మిరియం గుభాళింపు, పూల సువాసన మధ్య మరపురాని మధురానిభూతి పొందామని పలువురు పేర్కొన్నారు.

రంగుల రంగోళి..

గిరిజన మ్యూజియంలో నిర్వహించిన రంగుల రంగోలి పోటీల్లో ప్రథమ స్థానాన్ని అనకాపల్లి జిల్లా వాకపల్లికి చెందిన బి. దేవి, ద్వితీయ స్థానాన్ని ఎల్. మధుశ్రీ, తృతీయస్థానాన్ని అరకు డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని వి. సునీత కైవసం చేసుకున్నారు. ప్రత్యేక బహుమతిని విశాఖ వేలి పబ్లిక్ స్కూల్‌లో ఎల్‌కేజీ విద్యార్థిని చిన్మయి(7) సాధించారు. విజేతలకు కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా షీల్డ్, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ పోటీల్లో 32 మంది మహిళలు పాల్గొనగా వీరందరికీ ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ ఎంజె. అభిషేక్ గౌడ, పీవో వి. అభిషేక్, డీఆర్వో పద్మలత, ఇన్‌చార్జి డీడీ రజని పాల్గొన్నారు.



వేదికపై అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్, అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్ దంపతులు, జేసీ అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తదితరులు

పండగలా అరకు చలి ఉత్సవ్

ముగింపు వేడుకల్లో కలెక్టర్ దినేష్‌కుమార్

అరకు ఉత్సవ్ మూడు రోజులపాటు పండగ వాతావరణంలో జరిగిందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఉత్సవ్ ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. మూడు రోజులపాటు నిర్వహించిన కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. అంతర్లీనంగా దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు పలు విభాగాల్లో నిర్వహించిన పోటీలు దోహదపడ్డాయయన్నారు. గిరిజన విద్యార్థుల ఫ్యాషన్ షో ఆకట్టుకుందన్నారు. ఇటువంటి ఉత్సవాలు నిర్వహించడం వల్ల పర్యాటకంగా అరకులోయకు మరింత ప్రాచుర్యం లభిస్తుందన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ సతీమణి, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ మాట్లాడుతూ ఉత్సవాలు తమకు ఎంతో సంతోషాన్నిచ్చాయన్నారు. ఇక్కడి గిరిగ్రామదర్శిని సందర్శించామన్నారు. అక్కడి గిరిజన మహిళలు విక్రయిస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని ఆమె కోరారు. కష్టజీవులకు అండగా నిలవాలన్నారు. రంగోలి పోటీలు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ అందరి సహకారంతో అరకు చలి ఉత్సవ్ విజయవంతం అయిందన్నారు. వివిధ రాష్ట్రాల గిరిజన కళాకారులతోపాటు మన రాష్ట్రం నుంచి కొమ్ముకొయ్య, సవర, మణిపూర్, నాగలాండ్, జార్కండ్, ఛత్తీస్‌గడ్, ఒడిశా, తమిళనాడు ఇతర రాష్ట్రాల గిరిజన కళాకారులు ప్రదర్శనలు అన్నివర్గాల ప్రజలను ఆకట్టుకున్నాయన్నారు. మూడు రోజులపాటు ఫుడ్ ఫెస్టివల్ తదితర కార్యక్రమాలు ప్రతి ఒక్కరిని ఉత్తేజపరిచాయన్నారు. దేశంలో తూర్పు, పశ్చిమ కనుమలు మాత్రమే పారా గ్లైడింగ్‌కు అనుకూలమని, అలాంటిది మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్ద ఏర్పాటు చేయగలిగామన్నారు. అరకు ప్రాంతాన్ని అడ్వెంచర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ఆలోచన ఉందన్నారు. ఉత్సవాలు జరిగిన మూడు రోజుల్లో 15 వేల మంది పర్యాటకులు పాల్గొన్నట్టు భావిస్తున్నామని, బొర్రా, అరకు సందర్శిత ప్రాంతాల్లో వచ్చిన ఆదాయాన్ని బట్టి అంచనా వేస్తున్నామని పీవో తెలిపారు.

బైకును ఢీకొట్టిన కారు.. భర్త మృతి

భార్య, మేనకోడలికి తీవ్రగాయాలు



ప్రమాదంలో మృతి చెందిన రాము



చెట్టును ఢీకొని నుజ్జు నుజ్జయిన కారు

మాకవరపాలెం: బైకును కారు ఢీకొట్టిన ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్య, మేనకోడలికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కొండల అగ్రహారం గ్రామానికి చెందిన మూకల రాము(28), భార్య భవానీ (23), మేనకోడలు ప్రీతిక (6)తో కలసి ఆదివారం సాయంత్రం మోటారు సైకిల్‌పై నర్సీపట్నం వెళ్లాడు. తిరిగి రాత్రి స్వగ్రామం వస్తుండగా దాలింపేట వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో బైకుపై ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయడడంతో క్షతగాత్రులను 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా రాము మృతి చెందాడు. మిగిలిన ఇద్దరూ అక్కడే చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో బైకును ఢీకొట్టిన అనంతరం కారు రోడ్డు పక్కగా ఉన్న చెట్టును ఢీకొట్టి నుజ్జునుజ్జు అయింది. బైకు ముందు భాగం కూడా బాగా దెబ్బతింది. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు.

మామపై అల్లుడి హత్యాయత్నం

నిందితుడికి రిమాండ్

పెందుర్తి: కుటుంబ వివాదాల నేపథ్యంలో మామపై హత్యాయత్నానికి పాల్పడిన అల్లుడిని పెందుర్తి పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా తుమ్మపాలకు చెందిన నక్కా శ్రీనివాసరావు శనివారం రాత్రి అప్పన్నపాలెంలోని తన అత్తవారింటికి వచ్చాడు. కుటుంబ గొడవల నేపథ్యంలో శ్రీనివాసరావు, అతని మామ దేవరపు జోగారావు మధ్య తీవ్రస్థాయిలో వివాదం జరిగింది. ఈ క్రమంలో శ్రీనివాసరావు తన మామ జోగారావుపై కత్తితో దాడి చేశాడు. జోగారావు చేతిపై గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడ్ని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

డాక్టర్ లోకనాథానికి వ్యాఘ్రేశ్వరుడు బంగారు పతకం



అవార్డు అందుకుంటున్న కేజీహెచ్ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ లోకనాథం

మహారాణిపేట: కేజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్యుడు, ఏఎంసీ ప్రొఫెసర్ లాడి లోకనాథానికి అత్యుత్తమ వ్యాఘ్రేశ్వరుడు స్మారక బంగారు పతకం లభించింది. మోచేతి నొప్పితో బాధపడుతున్న అనేక మంది రోగులకు డాక్టర్ లోకనాథం వైద్య సేవలందించారు. దాదాపు 15 మందికి కేజీహెచ్‌లో శస్త్రచికిత్సలు చేశారు. ఈ సేవలను గుర్తించిన నలుగురు వైద్యుల కమిటీ డాక్టర్ లోకనాథానికి వ్యాఘ్రేశ్వరుడు స్మారక బంగారు పతకం ప్రదానం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు నగరంలో జరిగిన ఆర్థోపెడిక్ వైద్యుల సదస్సులో ప్రముఖుల చేతులమీదుగా ఆయన బంగారు పతకం స్వీకరించారు.

జిల్లా అభివృద్ధికి కృషి అవసరం

- సీపీఎం రాష్ట్ర మహాసభల్లో జిల్లా సమస్యలపై ప్రస్తావన
- పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న



మాట్లాడుతున్న సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి: కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న పేర్కొన్నారు. ఈ మేరకు నెల్లూరులో ఆదివారం జరిగిన పార్టీ రాష్ట్ర మహాసభల్లో అనకాపల్లి జిల్లాకు సంబంధించి పలు ప్రధాన సమస్యలను ప్రస్తావించినట్టు ఆయన తెలిపారు. సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి, రైతు, కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలని, అనకాపల్లి బెల్లం మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేసినట్టు చెప్పారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, విశాఖ డెయిరీ అవినీతి, అక్రమాలపై శాసనసభా కమిటీ నివేదికను బయట పెట్టాలని, తగ్గించిన పాల సేకరణ ధరను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశామన్నారు. నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని, గిరిజన గ్రామాలకు లింక్ రోడ్ల సౌకర్యం కల్పించి డోలీ మోతలను అరికట్టాలని విజ్ఞప్తి చేశామన్నారు. రైవాడ, కోనాం ప్రాజెక్టులపై అదాని హైడ్రో పవర్ ప్లాంట్‌ను నిలుపుదల చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేసి కూలీలకు ఏడాదికి 200 పని దినాలను కల్పించాలని మహాసభల్లో కోరామన్నారు. మహిళలు, మైనర్ బాలికలపైన, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రస్తావించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించామని వెంకన్న స్పష్టం చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకన్న

మాడుగుల: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మొండి చేయి చూపించారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి అన్నారు. ఆదివారం వారు మాడుగులలో విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని కేంద్రం పక్కన పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన చట్టం ప్రకారం జాతీయ విద్యాసంస్థలకు నిధుల కేటాయింపులు లేవన్నారు. విశాఖ రైల్వే జోన్, ఎన్ఐటీ, ఐఐటీ, ఐఐఎం, ట్రిపుల్ ఐటీ, గిరిజన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ, కడప స్టీల్‌ప్లాంట్, వైజాగ్ మెట్రో ఎయిమ్స్‌లతోపాటు వెనుకబడిన జిల్లాలకు నిధుల ఊసే లేదన్నారు. వెనుకబడిన ప్రాంతాలుగా గుర్తించిన ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలకు కూడా ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. అలాగే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు గత ఏడాది రూ.8,622 కోట్లు ఇస్తే, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.3,295 కోట్లు కేటాయించిందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల గురించి మాట్లాడక పోవడం విచారకరమన్నారు. ఏపీకి కేటాయించిన బడ్జెట్‌పై ప్రజలు మండిపడుతున్నారన్నారు. ముఖ్యమంత్రితోపాటు రాష్ట్రంలో గల అన్ని పార్టీల ఎంపీలు స్పందించి బడ్జెట్‌పై కేంద్రాన్ని నిలదీయాలన్నారు. ప్రశ్నించడానికి పార్టీని పెట్టామని గొప్పలు చెప్పుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా కేంద్రంపై మాట్లాడడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఏపీని మోసం చేసిన కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు.

గిరిజనుల హక్కులను హరించేందుకు కూటమి కుట్ర

- 1/70 చట్టానికి తూట్లు పొడిచే విధంగా స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలు
- ఎమ్మెల్సీ, ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుంభా రవిబాబు



సాక్షి, విశాఖపట్నం: గిరిజనుల హక్కులను హరించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రకు తెరలేపుతోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుంభా రవిబాబు మండిపడ్డారు. ఆదివారం లాసన్స్‌బే కాలనీలో విలేకరులతో రవిబాబు మాట్లాడుతూ గిరిజనులకు రక్షణ కవచంలా ఉండే 1/70 చట్టానికి తూట్లు పొడిచేలా స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు చేయడం పట్ల గిరిజనులంతా మండిపడుతున్నారన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఇదే ప్రయత్నం చేస్తే అప్పుడు గిరిజనులమంతా ప్రతిఘటించామని, మళ్లీ గిరిజనుల రక్షణ చట్టాన్ని హరించేందుకు కుట్రలకు పాల్పడితే సహించేది లేదంటూ హెచ్చరించారు. ఇదే జరిగితే ఆదివాసీల సంప్రదాయం, సంస్కృతి కనుమరుగయ్యే ప్రమాదం వాటిల్లుతుందని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఏజెన్సీలు 5వ షెడ్యూలు కిందకు వస్తాయని, దీన్ని ధిక్కరించే అధికారం ఏ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా లేదని పేర్కొన్నారు. ఇప్పటికే టూరిజం అభివృద్ధి పేరుతో పలు ఉల్లంఘనలు జరుగుతున్నాయని, వీటిని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. టూరిస్టుల కారణంగా ప్రభుత్వానికే ఆదాయం తప్ప.. గిరిజనులకు ఒరిగేదేమీ లేదన్నారు. ఇప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజన ప్రాంతాలు 1/70ను సవరిస్తే మరింత వెనుకబడిపోతాయని, తక్షణం ఇలాంటి ఆలోచనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

తీరం పచ్చన.. ఎందువలన?



పెదజాలరిపేట తీరంలోని సముద్రం రంగు మారడం ఆందోళన కలిగిస్తోంది. నిన్న మొన్నటి వరకు నల్లగా కనిపించిన సముద్ర తీరం.. ఇప్పుడు పచ్చగా దర్శనమిస్తోంది. నగరంలో ఏ ఉత్సవం జరిగినా.. ఆ విగ్రహాలను ఇక్కడ తీరంలో నిమజ్జనం చేస్తుంటారు. పూజా సామగ్రిని సముద్రంలో కలిపేస్తుంటారు. గెడ్డల నుంచి వచ్చే వ్యర్థాలు ఇక్కడే సముద్రంలో కలుస్తుంటాయి. విగ్రహాల్లో ఉన్న రంగులు, ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు గెడ్డల నుంచి వచ్చే కలుషిత రసాయనాల కారణంగా ఇసుకపై ఇలా పచ్చటి పొర ఏర్పడి ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇది సముద్ర కాలుష్యానికి ఒక హెచ్చరిక అని వ్యాఖ్యానిస్తున్నారు. - ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఆలయ అభివృద్ధిని అటకెక్కించారు..

- వడ్డాది వెంకన్నకే శఠగోపం పెడుతున్నారు
- ఆదాయ, వ్యయ వివరాలు బయటపెట్టాలి
- పాలక మండలి, అధికారులపై పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సన్యాసిరావు ధ్వజం



వడ్డాదిలో విలేకరులతో మాట్లాడుతున్న సన్యాసిరావు

బుచ్చెయ్యపేట: వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి దేవస్థానం పాలక మండలి, అధికారులు అడ్డుపడుతున్నారని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు ఆరోపించారు. ఆదివారం వడ్డాదిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వామి వారికి వస్తున్న ఆదాయం, హుండీ లెక్కింపులో లెక్కలు సరిగా చూపించడం లేదన్నారు. కల్యాణ మహోత్సవాల రోజుల్లో నకిలీ టికెట్లు ముద్రించి అమ్ముతున్నారని, పది రోజుల కిందట నిర్వహించిన గిరి ప్రదక్షిణకు హుండీ ఆదాయం రూ.లక్ష రాగా.. ఎవర్నీ పిలవకుండా హుండీలు తెరిచి లెక్కించి ఆ డబ్బులు మాయం చేశారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆలయ అభివృద్ధికి ఇచ్చిన లక్ష రూపాయల లెక్కలు తేల్చాలన్నారు. 50 ఎకరాల పంట ఫల సాయం, కొబ్బరి, తలనీలాలు, దర్శన టికెట్ల విక్రయాలు, హుండీ ఆదాయం, ఉత్సవాల్లో షాపుల నుంచి వసూలు చేస్తున్న డబ్బులు, వివాహాల రుసుంలు, తదితర మార్గాల ద్వారా వస్తున్న ఆదాయాన్ని ఎక్కడ ఖర్చు చేస్తున్నారో బయట పెట్టాలన్నారు. ఆదాయం వస్తున్నా ఆలయంలో పని చేస్తున్న అర్చకులకు, సిబ్బందికి 12 నెలలుగా జీతాలు ఇవ్వలేదని ఆరోపించారు. ఈ ఏడాది పలువురు దాతల సహాయంతో వెంకన్న ఉత్సవాలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని, పాలక మండలి సభ్యులు, అధికారులు కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుబిరెడ్డి వెంకటరావు, వీర్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి: మరొకరికి తీవ్ర గాయాలు

- ఘాట్‌రోడ్డులో ప్రమాదం
- ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన వ్యాన్
- ఘటనాస్థలంలో తీవ్ర గాయాలతో డ్రైవర్ దుర్మరణం



సంఘటన స్థలంలో మృతి చెందిన బైకిస్ట్ జయకుమార్, తీవ్ర గాయాలు పాలైన పాస్టర్ మోసే

పాడేరు: చర్చిలో ప్రార్థనల కోసం పాస్టర్‌తో కలిసి వస్తున్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అనకాపల్లి జిల్లా పరవాడ గ్రామానికి చెందిన పాస్టర్ మోసే తన స్నేహితుడు కాకినాడకు చెందిన జయకుమార్‌తో కలిసి పాడేరు మండలం గొండెలి పంచాయతీ వంచెడిగొంది గ్రామంలో ఉన్న చర్చిలో ఆదివారం ప్రార్థనల కోసం ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో పాడేరు-చోడవరం ప్రధాన రహదారి ఘాట్ రోడ్డులోని వంట్లమామిడి సమీపంలో మలుపు వద్ద పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్తున్న వ్యాన్ బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న విజయ్‌కుమార్ అనే యువకుడు తీవ్ర గాయాలపాలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. వెనుక కూర్చున్న పాస్టర్ మోసేకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన మోసేను అత్యవసర వైద్య చికిత్సల నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. మృతదేహాన్ని పాడేరు జిల్లా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచి వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటనపై పాడేరు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం



ప్రభుత్వ స్థలంలో మార్కింగ్ చేసిన దృశ్యం

అనకాపల్లి: మండలంలో అక్కిరెడ్డిపాలెం పంచాయతీ ఎన్టీఆర్ కాలనీ సీతారామ మందిరం రహదారి ప్రభుత్వ స్థలంలో రెండు దుకాణాలు నిర్మించేందుకు స్థానికంగా నివసిస్తున్న ఇద్దరు వ్యక్తులు ఆదివారం ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి, మార్కింగ్ చేశారు. దీనిపై స్థానికులు ఎదురు తిరగడంతో ఆ వ్యక్తులు వెనుదిరిగారు. స్థానిక ప్రజాప్రతినిధులు సహకారంలో రెండు దుకాణాలు నిర్మిస్తున్నట్లు అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

'ఇది కార్పొరేట్ బడ్జెట్'

అనకాపల్లి: కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చే విధంగా ఉందని, బడుగు, బలహీన వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేదని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గత ఏడాది రూ. 8622 కోట్లు కేటాయిస్తే ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ.3,295 కోట్లు మాత్రమే కేటాయించి రాష్ట్ర ప్రజలను నిరాశపరిచినట్లు తెలిపారు.

యోగాతో ఆరోగ్యకరమైన జీవితం



సైకిల్ యాత్రలో పాల్గొన్న యోగా సభ్యులు

అనకాపల్లి: నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా రవాణా అధికారి జి.మనోహర్ అన్నారు. గాంధీనగరంలోని యోగా లైఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ యాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా విపత్తు తర్వాత ప్రతి ఒక్కరు యోగాపై ఆసక్తి కనబరుస్తున్నారని అన్నారు. గాంధీనగరంలో ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర చోడవరం ముదూర్తి సంఘమేశ్వరస్వామి ఆలయం వరకూ సాగుతుందని, 30 మంది పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ జి.రామ్మూర్తి, దేవర్షి ఇంటర్నేషనల్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ సుందరయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, యోగా సభ్యులు సత్యనారాయణ, కొణతాల రాజేంద్ర, పీలా రవీంద్ర, కరణం దేవి, లక్ష్మి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

నేడు సూర్యనారాయణ స్వామి కల్యాణం

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు గొల్లవిల్లి శ్రీనివాసరావు, కోటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణంలో పాల్గొనే భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం స్వామివారి సారె ఊరేగింపు వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
ప్రేమిస్తావా	: సత్యనారాయణ స్క్రీన్-2
మదగజరాజ	: పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	: షిర్డీసాయి
ఏజెంట్ గయ్ 001	: వెంకటేశ్వర
గేమ్ ఛేంజర్	: శ్రీసత్య
మహేష్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 100 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు , బీ పాజిటివ్-30 యూనిట్లు, ఓ పాజిటివ్-50 యూనిట్లు, ఏబీ పాజిటివ్-8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 253 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 196 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

ఆదరించి.. అక్కున చేర్చుకుని..

- పుష్కర కాలంగా అభాగ్యులకు నిత్యాన్నదానం
- వేంకటేశ్వరస్వామి ఆలయం వేదికగా మహా యజ్ఞం
- కమిటీ.. దాతల సహకారంతోనే సాధ్యమయిందంటున్న నిర్వాహకులు

కశింకోట: స్థానిక గవరపేటలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం ఆపన్నులకు ఆసరాగా నిలుస్తోంది. పుష్కర కాలంగా ఈ కార్యక్రమం యజ్ఞంలా సాగుతోంది. పేదలు, వృద్ధులు, అనాథలకు కొండంత అండగా నిలుస్తోంది. గవరపేటలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వేదికగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గవరపేట శారదా నది ఒడ్డున శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని 2013 మేలో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి నిత్య అన్నదానం నిర్వహించాలని సంకల్పించారు. ఇక్కడ వైకుంఠ ఏకాదశి, శ్రీరామ నవమి రోజుల్లోను, మహా శివరాత్రి, కార్తీకమాసంలో అన్న సమారాధన నిర్వహిస్తున్నారు. దీంతో పాటు నిత్యాన్నదానం నిర్వహిస్తే శుభప్రదమని ఆలయ కమిటీ, విరాళ దాతల ప్రోత్సాహంతో నిత్యాన్న దాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత కొంత కాలం పాటు గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నడిపారు. అనంతరం మళ్లీ ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాతల తోడ్పాటుతో కార్యక్రమాన్ని నిరాటంకంగా నిర్వహిస్తున్నారు. మొదట్లో సుమారు 40 మందికి భోజనం అందించేవారు. వారిలో వృద్ధులు, కుటుంబ సభ్యుల అనాదరణకు గురైన వారు, పేదలు, అనాథలు, నడవలేని వారు ఉన్నారు. వీరిలో కొంత మంది కాలం చేశారు. దీంతో వారి సంఖ్య తగ్గి ప్రస్తుతం 20 మంది వరకు ఆలయంలో భోజనం చేస్తుండగా, మరో ఆరుగురు నడిచి రాలేని వారి ఇళ్లకు క్యారియర్లలో భోజనాలు తీసుకెళ్లి అందిస్తున్నారు. ఇందుకు ఆలయ కమిటీతో పాటు ప్రజలు తమ ఇళ్లలో పిల్లలు, పెద్దల జన్మదినోత్సవాలు, పెళ్లి రోజులు, కాలం చేసిన వారి సంవత్సరీకాలు, ఉత్సవాల సమయాల్లో నిత్యాన్నదానానికి విరాళం అందిస్తున్నారు. ఇలా ఆయా రోజుల్లో అన్నదానం చేస్తే తమకు శుభం జరుగుతుందని వారు భావిస్తారు. ఇతర రోజుల్లో కమిటీయే ఖర్చును భరిస్తుంది. అన్నంతో పాటు కూర, రసం, పులిహోర, పొంగలి వగైరా వడ్డిస్తారు. ప్రత్యేక రోజుల్లో అదనంగా స్వీటు పంపిణీ చేస్తారు. వంట చేయడానికి రూ.6 వేల వేతనంతో కమిటీ వంట మనిషిని నియమించింది. దీంతో ఆపన్నులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిత్యాన్న దానంతో తమకు సగం రోజు గడిచిపోతుందని, మరో పూట ఇంటి వద్ద ఏదో బాధ పడుతూ కాలం నెట్టుకు వస్తున్నామని పేర్కొంటున్నారు. కార్యక్రమం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఇక్కడే నిత్యం భోజనం చేస్తున్న వారు పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమానికి దాతల నుంచి మరింత తోడ్పాటు అందితే నిత్యాన్నదానం ఎల్లకాలం సాగిపోతుంది.



గవరపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం

కమిటీ, దాతల సహకారంతోనే..



నిత్యాన్నదాన పథకాన్ని 2013 మేలో వేంకటేశ్వర స్వామిని ప్రతిష్ఠించిన తర్వాత శుభప్రదమని మొదలుపెట్టాం. 25 మందికి పైగా నిత్యం భోజనం అందిస్తున్నాం. కమిటీతో పాటు విరాళ దాతల తోడ్పాటుతో కార్యక్రమం నిరాటంకంగా జరుగుతోంది. **– భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు,** వేంకటేశ్వర ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్, కశింకోట.

ప్రారంభం నుంచి ఇక్కడే భోజనం చేస్తున్నా..



నిత్యాన్నదానం ప్రారంభమైనప్పటి నుంచి ఇక్కడే భోజనం చేస్తున్నాను. మధ్యాహ్నం ఇక్కడ, రాత్రి ఇంటి వద్ద భోజనం తయారు చేసుకుంటాం. నేను ఒక్క దానినే. భర్త అప్పారావు, కుమార్తె మృతి చెందారు. ఇలా కాలం నెట్టుకు వస్తున్నాను.
–పెంటకోట ఆదియమ్మ, గవరపేట, కశింకోట.

బాసటగా నిలుస్తోంది..



ఈ కార్యక్రమం ప్రారంభమైన నాటి నుండి ఇక్కడే భోజనం చేస్తున్నాను. మాలాంటి ఎంతో మంది ఈ కార్యక్రమం వరం అని చెప్పాలి. ముసలి వాళ్లు, అనాథలు, ఎవరూ లేని వారికి ఈ నిత్యాన్నదానం ఎంతో బాసటగా నిలుస్తోంది.
–పెబ్బిలి సత్యనారాయణ, పూసర్లవీధి, కశింకోట.

ఈ కార్యక్రమం ఆగిపోకూడదు..



ఎవరూ లేని అనాథను. మొదటి నుంచి నిత్యాన్నదాన కార్యక్రమంలో భోజనం చేస్తున్నాను. ఇది మాలాంటి వారికి ఎంతగానో ఉపయోగపడుతోంది. ముసలి వాళ్లు, పేదలు, అనాథలకు సంవత్సరాలుగా ఇక్కడ భోజనం పెడుతున్నారు. ఈ కార్యక్రమం నిత్యం కొనసాగాలని కోరుకుంటున్నాను.
– వేగి జగ్గయ్యమ్మ, కనకమహాలక్ష్మి వీధి, కశింకోట.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న కశిరెడ్డి అప్పలనాయుడు

అనకాపల్లి: సత్యసాయి సంస్థల్లో సేవలు విస్తృతం చేయాలని సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలోని సత్య సాయిబాబా ఆలయంలో జిల్లా సంస్థల సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్య సాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలన్నారు. గ్రామ సేవలు, మొక్కలు నాటడం, నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాలు, పేద విద్యార్థులకు ఫీజుల చెల్లింపు, దివ్యాంగులకు సేవల వంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్లు కామరాజు, శక్తిమూర్తి, శంకర్, కృష్ణంరాజు, సంస్థల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు వీఆర్‌వోలు, ఆర్‌ఐలు, సర్వేయర్లకు శిక్షణ

అనకాపల్లి: స్థానిక గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు పట్టణ, మండలంలో గల వీఆర్‌వోలు, సర్వేయర్లు, ఆర్‌ఐలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీటీ వై.శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీ జాహ్నవి హాజరవుతారని తెలిపారు. శిక్షణకు హాజరు కాని వారి పేర్లు జేసీకి పంపిస్తామన్నారు.

4 నుంచి కన్యకా పరమేశ్వరి శత జయంత్యుత్సవాలు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి నూరేళ్లు అవుతున్న సందర్భంగా శత జయంతి ఉత్సవాలు ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు తెలిపారు. స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కమిటీ సభ్యులతో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భీష్మ ఏకాదశి రోజున అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగిందన్నారు. శత జయంతి ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఈనెల 4న 1000 మందితో అమ్మవారి ఆలయం నుంచి శోభాయాత్ర జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం జరుగుతుందని, 5న సామూహిక లక్ష తులసి నామార్చనలు, 6న నగరేశ్వరస్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 108 మంది సుహాసినిల పూజ, 7న లక్ష కుంకుమ నామార్చనలు, చండీహోమం, ఏకోత్తర సహస్ర (1001) కలశ మండపారాధన, 8న అమ్మవారికి 1001 కలశాలతో ఏకోత్తర సహస్ర పూజ, మహా కుంబాభిషేకం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, రాత్రికి నగరేశ్వరస్వామి, జనార్దన స్వామివార్ల వార్షిక తిరు కల్యాణ మహోత్సవం, పుష్పయాగం వంటి అనేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

శిథిల రహదారితో ఇక్కట్లు



కొప్పాక జాతీయ రహదారి దుస్థితి

అనకాపల్లి: కొప్పాక జాతీయ రహదారిలో ఏలేరు కాలువ బ్రిడ్జి నుంచి జలగల మదుం జంక్షన్ వరకూ శిథిలమైన రహదారికి తక్షణమే మరమ్మతులు చేయాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు. గాజువాక నుంచి అనకాపల్లి వచ్చే వాహన చోదకులు ఈ రహదారి గోతులమయంగా మారడంతో భయం భయంగా ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ రహదారి మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కృషితోనే ఉత్తమ ఫలితాలు

కశింకోట: ప్రణాళికాబద్ధంగా చదివి టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులు కృషి చేయాలని కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలు హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు అన్నారు. ఉపాధ్యాయులతో కలిసి టెన్త్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు చదువుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థుల చదువు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. టీవీలు, సెల్‌ఫోన్లకు వారిని దూరంగా ఉంచాలన్నారు. తమ స్కూలు నుంచి వంద మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారని తెలిపారు. శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో స్కూలు కమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టెన్త్ విద్యార్థులకు సూచనలిస్తున్న హెచ్ఎం అప్పారావు

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ తదితరులు

కశింకోట: స్థానిక గుర్రం జాషువా కాలనీలో వెలసిన అభయాంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జనసేన నాయకుడు భీశెట్టి రాంకీ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకుడు దాసరి బాబు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు పాదాల బహూకరణ



దాతలను సత్కరిస్తున్న ఆలయ చైర్మన్ సంజీవరావు తదితరులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మాడుగుల : ఎం.కోడూరు మోదకొండమ్మకు అదే గ్రామానికి చెందిన రాపర్తి సూర్యనారాయణ సత్యవతి దంపతులు వివిధ లోహాలతో తయారు చేసిన పాదాలు ఆలయ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొళ్లవిల్లి సంజీవరావు చేతుల మీదుగా సమర్పించారు. అంతకముందు దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు, మాజీ కోఆపరేటివ్ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

కేజేపురంలో...

మాడుగుల రూరల్ : కె.జె.పురం మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. మాడుగుల మోదమాంబ అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

అలంకారప్రాయంగా విద్యుత్ స్తంభాలు

తుమ్మపాల: మండలంలో రేబాక గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వంలో మెరుగైన విద్యుత్ సౌకర్యం అంటు హడావుడిగా వేసిన విద్యుత్ స్తంభాలకు ఏడేళ్లు పూర్తయినప్పటికీ విద్యుత్ తీగలకు మాత్రం నోచుకోలేదు. ఆర్ఈసీఎస్ నుంచి గ్రామంలో అన్ని ప్రాంతాలకు సుమారు 20కి పైగా విద్యుత్ స్తంభాలు వేసి రెండేళ్ల పాటు కాలయాపన చేశారు. తర్వాత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ స్తంభాలకు సరైన లెక్కలు లేకపోవడంతో అధికారులు చొరవ చూపలేకపోయారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో వేసిన స్తంభాలకు విద్యుత్ తీగలు అమర్చి విద్యుత్ సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై ఉన్న శ్రద్ధ గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించడం, లోఓల్టేజీ సమస్య పరిష్కరించడంపై లేదని ప్రజలు వాపోతున్నారు. రానున్న వేసవి దృష్ట్యా లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా కూటమి నాయకులు, అధికారులు చొరవ తీసుకోవాలని, ఖాళీగా ఉన్న విద్యుత్ స్తంభాలకు తీగలు అమర్చి మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.



రేబాకలో తీగలు లేకుండా ఖాళీగా దర్శనమిస్తున్న విద్యుత్ స్తంభాలు

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని నిరసన ప్రదర్శన

కశింకోట: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కోరుతూ కార్మికులు ఆదివారం మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బిల్డింగ్ వర్కర్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రమాదాలకు గురైన ఎలక్ట్రీషియన్, ప్లంబర్, తాపీ మేస్త్రీ తదితరులకు బోర్డు ద్వారా ఆర్థిక సహాయం అందించాలన్నారు. 20 ఏళ్ల క్రితం ఉన్న ఉచిత ఇసుక విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ సామగ్రి ధరలు తగ్గించి సామాన్యులు విరివిగా భవన నిర్మాణాలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా కార్మికుల ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలన్నారు. 50 ఏళ్లు నిండిన కార్మికులకు పింఛన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు టి. అప్పారావు, కె. గోవింద, ఎన్. శ్రీను, ఎస్. నూకరాజు, సీహెచ్ శేషు తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు

అంకితభావంతో పనిచేస్తే తప్పక గుర్తింపు

రోలుగుంట : అంకిత భావంతో విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగికి తప్పక గుర్తింపు ఉంటుందని టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ అన్నారు. శరభవరం పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించిన ఎ.వి.ఎస్.ప్రసాద్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని శనివారం రాత్రి అదే పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రఘువర్మ ఘనంగా ప్రసాద్‌ను సన్మానించారు. 35 ఏళ్ల పాటు విధులు నిర్వహించిన ప్రసాద్ ఉన్నతాధికారులతో పాటు విద్యార్థుల మన్ననలు పొందారని ప్రశంసించారు. కార్యక్రమంలో రోలుగుంట మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడు ధర్మారావు, దుర్గాప్రసాద్, రాము, బి.రమణ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు



తాండవ హైస్కూల్లో జ్ఞాన సరస్వతికి పూజలు



చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయిస్తున్న తల్లిదండ్రులు




పెదబొడ్డేపల్లి జ్ఞాన సరస్వతి ఆలయంలో అక్షర అభ్యాసానికి హాజరైన చిన్నారులు, తల్లిదండ్రులు

తోడ్పాటు అందించిన పూర్వ విద్యార్థులు

నాతవరం : ఎంతో చరిత్ర కలిగిన తాండవ హైస్కూల్‌లో ఆదివారం 150 మంది చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తాండవ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో ఉన్న జ్ఞాన సరస్వతి విగ్రహం వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిపారు. పాఠశాలలు ఏర్పాటు చేసిన దగ్గర్నుంచి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. నాడు తమకు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి సత్కరించారు. తరువాత పూర్వవిద్యార్థుల సమావేశం నిర్వహించారు. పాఠశాలకు కావలసిన మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పాటు అందించాలని తీర్మానించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎంఈవో సత్యనారాయణ మాట్లాడుతూ పండగ వాతావరణంలో ఈ అక్షరాభ్యాసాలు జరగడం అభినందనీయమన్నారు. అక్షరాభ్యాసానికి వచ్చిన చిన్నారులందరికీ పలక ఇతర సామాగ్రిని పూర్వ విద్యార్థి చమ్మచింత గ్రామానికి చెందిన న్యాయవాది అప్పన రాజుబాబు తన సొంత ఖర్చుతో సమకూర్చారు. హైస్కూల్‌లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు, పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసాలు



ఎ.కోడూరులో గల సరస్వతీదేవి విగ్రహం

కె.కోటపాడు : మండలంలో ఎ.కోడూరు హైస్కూల్లో గల సరస్వతీ దేవి మందిరంతో పాటు కె.కోటపాడు అయ్యన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాల, చౌడువాడ సాయి విద్యా విహార్ పాఠశాలల్లో సోమవారం సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమాన్ని జరపనున్నారు. వసంత పంచమి పర్వదినం సందర్భంగా పాఠశాలల్లో చేర్పించే విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసాలను నిర్వహించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



సరస్వతీదేవి ఊరేగింపులో చిడతల కోలాటం

నర్సీపట్నం : వసంత పంచమిని పురస్కరించుకుని మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్, విశ్రాంత ఉపాధ్యాయుడు బాబూరావు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం చిన్నారులకు పలకలు, సరస్వతి దేవి చిత్రపటాలను అందజేశారు. సరస్వతి దేవి విగ్రహాన్ని ఊరేగించారు. ఊరేగింపులో చిన్నారులు, మహిళల చిడతల కోలాటం విశేషంగా అకట్టుకుంది.

చదవడం ఇష్టంగా చేసుకోవాలి

నర్సీపట్నం : చదవడం ఇష్టంగా చేసుకోవాలని విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకరరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సమయం దొరికినప్పుడల్లా గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలన్నారు. పిల్లలకు అవసరమైన రకరకాల కథల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారి పి.దమయంతి కథల పుస్తకాలను విద్యార్థులతో చదివించి, వాటిలోని సారాంశాలను వివరించారు. చదవడం ద్వారా జ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు.



విద్యార్థులకు సూచనలు చేస్తున్న విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు

రేపు ఎడ్ల బళ్ల పోటీలు

దేవరాపల్లి : శంభువానిపాలెంలో పరదేశమ్మ తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.12వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.2వేలు, రూ. వెయ్యి చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్టు తెలిపారు. పరదేశమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.